# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 240
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జూన్ 24, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




సీనియర్ జర్నలిస్ట్
## దత్తు రెడ్డి హఠాన్మరణం
- సంతాపం ప్రకటించిన నేతలు, పాత్రికేయులు

8లో..

## డిప్యూటీ మేయర్ ఇలాకాలో..
# నీటి కష్టాలు






- 36 డివిజన్ లో తాగునీటి కోసం పాట్లు
- అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం
- 8 నెలలుగా పరిష్కారం చూపని అధికారులు
- ఖాళీ బిందెలతో మహిళల నిరసన
- అండగా నిలిచిన బీజేపీ నేతలు



మిషన్ భగీరథ ద్వారా నగర పరిధిలోని ఇంటింటికీ ప్రతీరోజు తాగు నీటిని అందిస్తామన్న అధికారులు, పాలకుల హామీలు అటకెక్కాయి. దీంతో బిందెడు నీటికోసం మహిళలు పడరాని పాట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వరంగల్ మహా నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ ఇలాఖాలోని 36వ డివిజన్ చింతల్ ఆర్ఎస్ నగర్ లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. తాగునీటి కష్టాలు తీర్చాలంటూ స్థానికులు పలు మార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. బిందెలను రోడ్డుకు అడ్డంగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ నగర్ లోని ఎనబై నివాసాలకు గత ఎనిమిది నెలలుగా తాగు నీరు అందక తండ్లాడుతున్నా పాలకులు, అధికారులు స్పందించడంలేదంటూ నినదించారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ తాగునీటికోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రజలకు వెన్నంటి ఉండాల్సిన ప్రజా ప్రతినిధులు స్థానిక సమస్యలను గాలికి వదిలేయడంతో తప్పని పరిస్థితిలో రోడ్డుపై నిరసన తెలుపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీ నాయకుడు ఆడెపు వెంకటేశ్ నేతృత్వంలో పలువురు బీజేపీ నేతలు మహిళలకు మద్దతుగా నిలిచారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలంటూ వెంకటేశ్ డిమాండ్ చేశారు. - వరంగల్ వాయిస్, కాశిబుగ్గ



## డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం
- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్ల ఆవిష్కరణ

8లో..

## 9 రోజులు రూ.9,000కోట్లు
- రైతుల ఖాతాల్లో రైతు భరోసా
- వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డి





8లో..

## కష్టపడిన వారికే పదవులు
- త్వరలో మార్కెట్, దేవాలయ కమిటీల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పార్టీని సిద్ధం చేయాలి
- రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



# చేనేతపై డాక్యుమెంటేషన్

- జైపూర్ నుంచి విచ్చేసిన విద్యార్థులు, అధ్యాపకులు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్ (ఐఐసీడీ) జైపూర్ కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు ప్రొఫెసర్ బేస్సీ సెసిల్ పర్యవేక్షణలో మంగళవారం కొత్తవాడలోని చేనేత కార్మికుల గృహాలను సందర్శించి నేత కార్మికులతో మాట్లాడారు. చేనేత పనికి సంబంధించిన ప్రక్రియను డాక్యుమెంటేషన్ చేవారు. తెలంగాణ క్రాఫ్ట్స్ కౌన్సిల్ వారి సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చేతి వృత్తులు, వాటి ఉత్పత్తులను డాక్యుమెంట్ చేయనున్నట్లు వారు ప్రకటించారు. కళాకారులు, చేతివృత్తుల సంఘాలతో తెలంగాణ క్రాఫ్ట్ కౌన్సిల్ సన్నిహితంగా పనిచేస్తోంది. కానీ సంవత్సరాలు గడిచేకొద్దీ పాత తరం కళాకారులు, నేత కార్మికులు వివిధ కారణాలతో తమ నైపుణ్యాన్ని తదుపరి తరానికి అందించలేకపోయారు. ఈ సవాలును ఎదుర్కోవడానికి, చేనేత లక్ష్యాన్ని కొనసాగించడానికి సీసీటీ డాక్యుమెంటేషన్ ప్రాజెక్టును నడుపుతోందని వివరించారు. వీ హబ్, డీఆర్డీఏ, సెర్ప్, స్థానిక సహకార సంఘాల అధికారులు ఈ బృందంతో పాలుపంచుకున్నారు. సర్వే బృందానికి టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పా వెంకటేశ్వర్లు నేత నేతృత్వం వహించారు. మగ్గానికి సంబంధించిన పనులు డాక్యుమెంట్ చేయడంలో సహకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రూరల్ డెవలప్ మెంట్ అథారిటీ అధికారులు భవాని, అశోక్, డాలియా తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు తోడ్పాటు అందించాలి

- ప్రాధాన్యత రంగాల్లో రుణాల పంపిణీ మరింత పెంచాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- బ్యాంకర్లతో డీసీసీ డీఎల్ఆర్సీ సమావేశం





**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో (మార్చి 2015 చివరి వరకు) సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ ద్వారా 2025-26 సంవత్సరానికి సంబంధించి వరంగల్ జిల్లా అన్నువల్ క్రెడిట్ ప్లాన్ కింద రూ.9274.25 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెంపొందించేందుకు కృషి చేస్తున్నదని, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల ఏర్పాటులో సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సామాజిక భద్రత పథకంలో భాగంగా పీఎం జీవన్ జ్యోతి పథకంలో నామినికి రూ.2 లక్షల యూబీఐ వరంగల్ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కన్వీనర్ ఎల్డీఎం యూబీఐ హావేలి రాజు, యూనియన్ బ్యాంకు ఆర్ హెచ్ కమలాకర్, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్, నాబార్డ్ ఏజీఎం చైతన్య రవి, బ్యాంకుల కంట్రోలర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఘనంగా రైతు పండుగ

- తూర్పులో పాలాభిషేకం
- పాల్గొన్న నియోజకవర్గం నేతలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వానాకాలం పంటల సాగు కోసం రైతు భరోసా నగదు బదిలీ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'రైతు పండుగ' పేరుతో సంబరాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆదేశాల మేరకు రైతు భరోసా సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజు హాజరై ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిశేకం చేశారు. అనంతరం గోపాల నవీన్ రాజు మాట్లాడుతూ ఇచ్చినమాట ప్రకారం తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే అరుదైన రికార్డు అన్నారు. ఇప్పటి వరకు 1,49,39,111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. ఎలాంటి పరిమితులు లేకుండా సాగులో ఉన్న ప్రతి ఎకరానికీ పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా రైతు సంక్షేమం విషయంలో రాజీపడకుండా పెట్టుబడి సాయం అందించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రుణమాఫీ పథకాన్ని కూడా ఇలాగే 2024 ఆగస్టు 15 లోగా పూర్తి చేశామని చెప్పారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేలు చొప్పున ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.6 వేల చొప్పున సంవత్సరానికి రూ.12 వేలు అందించడం జరిగిందన్నారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ర్యాలీలో పాల్గొన్న ఇనగాల..

రైతు భరోసా సంబరాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రైతు భరోసా నిధులు విడుదల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రైతులతో నిర్వహించిన ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం మేము ఇచ్చాము అని చెప్పుకునే దానికంటే అతి గొప్పగా, రాష్ట్రంలో రైతన్నలందరికీ వ్యవసాయం అంటే దండగ కాదు పండగ అనేలా, వ్యవసాయం ప్రారంభానికి ముందే 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదే అని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు.



# 26నుంచి శాకంభరీ

### మంత్రి సురేఖకు ఆహ్వానం అందించిన ఈఓ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్ర కాళి దేవస్థానంలో 15 రోజుల పాటు నిర్వహించనున్న శాకంభరీ నవరాత్ర మహోత్సవములు ఈ నెల 26వే తేదీ గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు అమ్మవారికి సహస్ర కలశాభిషేకం జరుగుతుంది. ఆ తర్వాత నిత్యాయాగం ప్రారంభమౌతుంది. ఈ యాగాన్నే తిథిమండల దేవతా యజనం అని కూడా అంటారు. మాసంలోని ప్రతి తిథికి జ్యోతిశ్శాస్త్రం ప్రకారం అధిదేవతలున్నట్లే వైదిక స్మార్త శక్తాద్వైత దక్షిణాచార సంప్రదాయాన్ని అనుసరించి ప్రతి తిథికి కాళీ క్రమంలో షోడశి క్రమంలో ఒక్కొక్క అధిదేవత ఉంటుంది. ఈ దేవతలను ఆరాధించడం వల్ల ప్రకృతి సమతౌల్యత దెబ్బతినకుండా ఉండటమే గాక సమస్త మానవాళి సుఖశాంతులతో సకలైశ్వర్యాది. సర్వ సౌభాగ్య సిద్ధిని పొందుతారని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ పదిహేను రోజులు ఉదయం కాళీ క్రమంలో సాయంకాలం శ్రీ (షోడశి) క్రమంలో ఈ నిత్యాయాగం అనగా తిథిమండల దేవతార్చన జరుగుతుంది. ఆఖరి రోజు ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారికి ఉపలభ్యమగు పలు విధములైన శాకములచే అమ్మవారిని శాకంభరిగా అలంకరిస్తారు. మంగళవారం ఆలయ ధర్మకర్తలు జారతి వెంకటేశ్వర్లు, తొగరు క్రాంతి, అనంతుల శ్రీనివాసరావు, ఎక్స్ ఆఫీషియో మెంబర్ పార్శంది నర్సింహమూర్తి, అర్చకులు టక్కర్లు సత్యం, కార్యనిర్వహణాధికారి శేషుభారతి హైదరాబాదులో తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంద్రి కొండా సురేఖ నివాసానికి వెళ్లి ఉత్సవాలకు ఆహ్వానించారు.

# ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు

## ● గ్రేటర్ వరంగల్ మున్నూరు కాపు నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మున్నూరు కాపు భవన నిర్మాణం కోసం రూ. 7.05 కోట్లు మంజూరు చేసి, శంకుస్థాపన చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మున్నూరు కాపు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లుగా కలగా ఉన్న మున్నూరు కాపు భవన నిర్మాణ కలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నెరవేర్చారని తోట వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్నికలలో గెలవడం కోసం కులం కార్డును అడ్డుపెట్టుకుని రాజకీయం చేసిన వారికి బుద్ధి చెప్పేలా ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని చెప్పారు. 50 వేల అతి పెద్ద ఓటు బ్యాంకును స్వార్థం కోసం వాడుకున్న గత పాలకులకు ఇది చెంపపెట్టు అని, ఆరు నెలల్లో భవనం పూర్తి చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గెలిచిన రెండు సంవత్సరాలలోపు అనేక అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. మున్నూరు కాపు కులాన్ని అడ్డుపెట్టుకుని పదవులు పొంది, ఆ తరువాత నిర్లక్ష్యం చేశారని గత పాలకులపై ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మానస రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్ నాగరాజు, నాయకులు పవన్ తోట, సురేందర్, లక్ష్మణ్, మనోహర్, సతీష్, పున్నం చందర్, రాజ్ కుమార్, రాకేష్, కుమార్ యాదవ్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

# గుగులోత్ రాజునాయక్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధకులు గుగులోత్ రాజునాయక్ కు డాక్టరేట్ లభించింది. “ఇంపాక్ట్ ఆఫ్ కమర్షియలైజేషన్ ఆఫ్ అగ్రికల్చర్ – ఇన్ తెలంగాణ ఏ స్టడీ ఇన్...” అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గాను కేయూ ఈ డాక్టరేట్‌ను ప్రకటించింది. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి పర్యవేక్షణలో రాజునాయక్ ఈ పరిశోధనను పూర్తి చేశారు. కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ ఈ డాక్టరేట్‌ను ప్రకటించారు. రాజునాయక్ అర్థశాస్త్ర విభాగంలో జరిగిన అంతర్జాతీయ, వివిధ జాతీయ సదస్సులలో సుమారు తొమ్మిది పరిశోధనా వ్యాసాలు, జర్నల్స్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ సురేష్ లాల్, డా. రమేష్, ఇతర పరిశోధకులు, విద్యార్థి సంఘాల నాయకులు రాజునాయక్‌ను అభినందించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలం మారుమూల రామన్నగూడెం తండాలో పుట్టి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి అత్యున్నత చదువును పూర్తి చేసుకొని డాక్టరేట్ పొందడం చాలా గర్వకారణమని కేయూ విద్యార్థి, గిరిజన సంఘాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా రాజునాయక్‌ను శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఎన్ఐటి పరిశోధకులు వినోద్ లోక్ నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్ నాయక్, ఎల్బీ కళాశాల, పింగిలి కళాశాల ఉపాధ్యాయులు డా. సదానందం, డా. రామకృష్ణారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు సుమన్ నాయక్, డా. వెంకటేశ్వర్లు, వెంకన్న నాయక్, రమేష్ నాయక్, సేవాలాల్ సేన నాయకులు మురళి నాయక్, అశోక్ నాయక్, ఆలోజి కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ , ప్రజాసంఘాల నాయకులు తదితరులు రాజు నాయక్ కు అభినందనలు తెలిపారు.

# శస్త్ర చికిత్సలో వైద్యుల నిర్లక్ష్యం

## ఆసుపత్రి ఎదుట రోగి బంధువుల ఆందోళన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఆయుష్ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శస్త్రచికిత్స వికటించిందని ఆరోపిస్తూ రోగి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆసుపత్రి అనుమతులు రద్దు చేసి, వెంటనే సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రోగి కుమారుడు కార్తీక్ మాట్లాడుతూ, జంగిలిగొండ గ్రామానికి చెందిన తన తల్లి బైరోజు రమాదేవి కడుపు నొప్పితో బాధపడుతుంటే, మహబూబాబాద్‌లోని ఆయుష్ ఆసుపత్రికి తీసుకువచ్చామన్నారు. అక్కడ వైద్యుడు అంజన్ కుమార్ పరీక్షించి, శస్త్రచికిత్స ద్వారా గర్భసంచిని తొలగించారని తెలిపారు. అయితే, శస్త్రచికిత్స చేసినప్పటి నుంచి రమాదేవికి మూత్రం రాక తీవ్ర ఇబ్బందులు పడుతూ పరిస్థితి విషమించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని చెప్పారు. నిర్లక్ష్యంగా శస్త్రచికిత్స చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి కార్తీక్ విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రోగి బంధువులు పాల్గొన్నారు.

# పాఠశాలకు ఆట వస్తువుల పంపిణీ



**వరంగల్ వాయిస్, వర్ధన్న పేట :** మండలంలోని ల్యాబర్తి ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో రూ.10,000 విలువైన ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డీసీటీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో భాగంగా ఆటలు ఎంతో ముఖ్యమన్నారు. గత సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడా విద్యార్థులను ప్రశంసిస్తూ, ఆటలతో విద్యార్థులు మానసిక ఉల్లాసం పొందుతారని పేర్కొన్నారు. ల్యాబర్తి పాఠశాల గత సంవత్సరం సాధించిన 100 శాతం పదవ తరగతి ఫలితాలను, మండలంలో ద్వితీయ స్థానాన్ని ఆయన అభినందించారు. పాఠశాలకు ఎటువంటి మౌలిక వసతులు అవసరమైనా లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ అధ్యక్షులు సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, ఆటల్లో, సాంస్కృతిక కార్యకలాపాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొంటే విద్యలో కూడా రాణిస్తారని పేర్కొన్నారు. దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తున్న ఉపాధ్యాయుల పనితీరును ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వర్ధన్నపేట బాధ్యులు సుదర్శన్ రెడ్డి, సునీల్, నరసయ్య, సతీష్, ప్రభాకర్, వెంకన్నతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవార్లకు వెండి వస్తువుల బహూకరణ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గీసుకొండ మండలం వంచనగిరి క్రాస్ రోడ్‌లోని కోటగండి మైసమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్లకు వరంగల్ చార్బౌలికి చెందిన ఆరె సాయి చరణ్ మంగళవారం వెండి వస్తువులను బహూకరించారు. తను అనుకున్న కోరిక నెరవేరిన నేపథ్యంలో, సాయి చరణ్ ఇద్దరు అమ్మవార్లకు వెండి శఠగోపురం, వెండి పాదాలను ఆలయ అర్చకుడు అయ్యప్ప శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి చరణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు సుజాత–రమేష్ పాల్గొన్నారు.

# బీసీ కుల, జనగణనను కేంద్రం తక్షణమే చేపట్టాలి

## ● తాటిపాముల వెంకట్రాములు డిమాండ్



**వరంగల్ వాయిస్, ములుగు :** బీసీ ఉద్యమాలకు తలొగ్గిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలయాపన చేయకుండా తక్షణమే జనగణనతో పాటు బీసీ కుల జనగణన చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ములుగులోని రిటైర్డ్ టీచర్స్ ఎంప్లాయిస్ బిల్డింగ్‌లో ముత్యాల రాజు అధ్యక్షతన జరిగిన ములుగు జిల్లా బీసీ హక్కుల సాధన సమితి మహాసభలో, ములుగు జిల్లా ఇంచార్జి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామితో కలిసి వెంకట్రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ ఈ దేశంలో 1931లో బ్రిటిష్ వారు చేసిన కుల జనగణన తప్ప, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం కూడా బీసీల కుల జనగణన చేపట్టలేదని అన్నారు. దేశంలో ఉత్పత్తి కులాలైన బీసీలు అన్ని రంగాలలో దేశాన్ని తమ భుజస్కందాలపై మోస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో బీసీలను నాలుగవ శ్రేణి ప్రజలుగా ఆధిపత్య పార్టీలు గుర్తిస్తున్నాయని విమర్శించారు. దేశంలోని పశువులు, పక్షులు, జంతువులకు లెక్కలు తీస్తున్న ప్రభుత్వాలు బీసీలకు జనగణన ఎందుకు చేపట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. నూటికి 60 శాతం ఉన్న బీసీలు కడుతున్న పన్నుల మీదనే ఈ దేశం నడుస్తుందని, కానీ విద్యలో, ఉద్యోగ అవకాశాలలో కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ అగ్రవర్ణాల పేదల పేరుతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకువచ్చి వారికి 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో మోడీ ప్రభుత్వం కేవలం అగ్రవర్ణాల పక్షపాతి అని తేలిపోయిందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఎవరు ఎంత శాతం ఉన్నారో లెక్కలు తీసి, ఎవరి వాటా వారికి చట్టబద్ధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బీసీ బిల్లును తక్షణమే ఆమోదించాలని, వెంటనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కుమారస్వామి డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు ఇవ్వవలసిన పెండింగ్ నిధులను వెంటనే మంజూరు చేయాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను సమగ్రంగా అమలు చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీసీ హక్కుల కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మించడానికి ఈ మహాసభలో ఎన్నికైన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగా ములుగు జిల్లా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా ముత్యాల రాజు, ప్రధాన కార్యదర్శిగా బండి నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఒడి సారయ్య, సహాయ కార్యదర్శి జక్కుల ఐలయ్య, కోశాధికారి: కొక్కుల రాజేందర్ లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జంపాల రవీందర్ (ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి), ఎండీ అమ్జద్ పాషా (జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి) తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు ధైర్యాన్నిచ్చిన ప్రజాపాలన



**వరంగల్ వాయిస్, నడికూడ :** రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని విశ్వసించిన ప్రజా ప్రభుత్వం వారి ఖాతాల్లో భరోసా నిధులు జమచేసి ధైర్యాన్ని నింపిందని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబురాలను మండల కేంద్రంలో నిర్వహించారు. పార్టీ అగ్ర నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేవలం 18 నెలల కాలంలోనే రైతుల కోసం 21 వేల కోట్లు ప్రజా ప్రభుత్వ ఖర్చు పెట్టిందని, గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో 18 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మల్హాల్ రావు, మాజీ జడ్పీటీసీ పాడి కల్పనా ప్రతాప రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని, మండల సమన్వయ కమిటీ సభ్యులు పర్నెం తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, పెద్దబోయిన రవీందర్ యాదవ్, వివిధ గ్రామాల కమిటీ అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

# దుద్దిళ్ల శ్రీను బాబుకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడు, నూతనంగా టీపీసీసీ కార్యదర్శిగా నియమితులైన దుద్దిళ్ల శ్రీను బాబుకు హనుమకొండలో ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రాంనగర్‌లోని శ్రీ భువనేశ్వరి దేవాలయానికి విచ్చేసి, టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాము, విష్ణుదాసు వంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పూజల అనంతరం, హుజురాబాద్ నియోజకవర్గ మాజీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ విష్ణుదాసు వంశీధర్ రావు, తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాములు టీపీసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబును సన్మానించారు. ఈ సందర్భంగా, నూతనంగా భద్రకాళి ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన మోత్కూరి మయూరి రామును కూడా టీపీసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ మాజీ జనరల్ సెక్రటరీ, టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర పీఆర్వో విష్ణుదాసు వంశీధర్ రావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ శర్మ, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉదయమర్రి కృష్ణమూర్తి, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, 52వ డివిజన్ అధ్యక్షుడు తడుక సుమన్, టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ మహిళా అధ్యక్షురాలు దేవులపల్లి వాణి, దేవులపల్లి హరిహరన్, పండితులు బ్రాహ్మణపల్లి మధు శర్మ, శంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



**వరంగల్ వాయిస్, గణపురం :** స్థానిక భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో పలువురు నాయకులు చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో టీబీజీకేఎస్ (తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అనుబంధ సంఘం) గణపురం మండల అధ్యక్షుడు బత్తిని శివశంకర్ గౌడ్, మాజీ యూత్ నాయకులు జి.రామకృష్ణ గౌడ్, ఆర్. శ్రీకాంత్, ఎం.నిఖిల్, కె. వికాస్ గౌడ్, ఎన్. అరవింద్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వైస్ చైర్మన్ దూడపాక శంకర్ కూడా పాల్గొన్నారు.

# గాండ్ల స్రవంతి సగరకు సత్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని భద్రకాళీ దేవస్థానం కమిటీ మెంబర్‌గా తెలంగాణ సగర సంఘం మహిళా అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర నియమితులైన విషయం తెలిసిందే. కాగా కరీంనగర్ సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట రాజు సగర, జిల్లా కోశాధికారి కాటిపెల్లి కుమారస్వామి సగర (బాబు) మంగళవారం స్రవంతి–విజేందర్ సగర దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రకాళీ అమ్మవారి దీవెనలతో గాండ్ల స్రవంతి సగర మున్ముందు మరిన్ని పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం హన్మకొండ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొడిపాక గణేష్ సగర తదితరులు పాల్గొన్నారు.

# 27న ధర్నాను విజయవంతం చేయండి

- **టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి పిలుపు**




**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే విధానాలను ప్రతిఘటిస్తూ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్ ఉపాధ్యాయులకు, విద్యాభిమానులకు పిలుపునిచ్చారు. మంగళవారం నడికూడ మండలంలోని నడికూడ, వరికోలు, రాయపర్తి, పులిగిల్ల ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులచే ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్ మాట్లాడుతూ, విద్యా కార్పొరేటీకరణను, కాషాయీకరణను ప్రోత్సహించే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాన్ని మానుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20% నిధులు విద్యకు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో విదేశీ, ప్రైవేటు విశ్వవిద్యాలయాలను అనుమతించకూడదని, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో తెచ్చిన 25 జీవో నిబంధనలను రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలి, నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి, ప్రభుత్వ రంగంలో ఉన్న 30 వేల పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రమాణాలు గల పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి అందుకు సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించాలి. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ ధర్నాను నిర్వహిస్తున్నామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశాలలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, శ్రీనివాస్, కృపమ్మ, శరత్ గౌడ, సంపత్ రెడ్డి, భిక్షపతి, శ్రవణ్ కుమార్, రాజు నాయక్, సురేష్, రజనీకాంత్, శివకుమార్, శివ చేతన్, జయ, సుమలత, కుమారస్వామి, సుభాని, ప్రదీప్, అశోక్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ జెండా నిర్మాణానికి భూమి పూజ



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట మండలంలోని వావిలాల, వెంకటేశ్వర్లపల్లి, పాపక్కపల్లి గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న జెండా నిర్మాణ పనులకు మంగళవారం భూమి పూజ జరిగింది. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మాదిగ జాతి కోసం ఎస్సీ వర్గీకరణ సాధించడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ, లక్ష డప్పుల వెయ్యి గొంతికల తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ రామంచ భరత్, కాంగ్రెస్ పార్టీ వావిలాల గ్రామ శాఖ అధ్యక్షుడు వానరాశి జాన్, రెంటాల సంపత్ పాల్గొన్నారు.

# శాఖమూరి అమర్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గెలుపొందిన ప్రగతి డెవలపర్స్ అధినేత శాఖామూరి అమర్ ను మంగళవారం పలువురు అభినందించారు. పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు. రెండు దశాబ్దాలు పైగా కన్ స్ట్రక్షన్ రంగంలో నాణ్యమైన నిర్మాణాలు చేపడుతూ తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్న ప్రగతి డెవలపర్స్ అధినేత శాఖమూరి అమర్ హోరాహోరీగా జరిగిన ప్రతిష్టాత్మకమైన క్రెడాయ్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్రెడాయ్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీ సారథ్యంలో నిర్మాణ రంగంలో ఓరుగల్లు నగరం పేరును దేశ స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ హై స్కూల్, నాగేశ్వరరావు ఐఐటీ ఇన్స్టిట్యూట్ యజమానులు శివ నాగేశ్వరరావు, శ్రీపాల్ రెడ్డి, నర్సింగరావు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్, శ్రీ అవేన్యూ ఇన్ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్ అల్లం రాజేశ్ వర్మ, సీనియర్ నాయకుడు, క్రెడాయ్ మెంబర్ సోదా రామకృష్ణ పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుకు కేయూ సెరికల్చర్ విభాగం ఆదర్శం



**వరంగల్ వాయిస్, కేయూ:** సేంద్రియ సాగు – ఒక ఆదర్శ వ్యవసాయ మోడల్ అని కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) సెరికల్చర్ విభాగం స్పష్టం చేసింది. సేంద్రియ ఎరువుల వినియోగం నేల సారాన్ని మెరుగుపరచడంలో, పంట దిగుబడిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఈ విభాగం వెల్లడించింది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అభివృద్ధి చేసిన రెండున్నర ఎకరాల వ్యవసాయ క్షేత్రం దీనికి ఉదాహరణగా నిలుస్తోంది. విభాగానికి చెందిన డా. కె. సుజాత, డా. కనిజ్ ఫాతిమా నేతృత్వంలో విద్యార్థులు ప్రతిరోజూ వ్యవసాయ క్షేత్రంలో పాల్గొంటూ, సేంద్రియ సాగుపై ఆచరణాత్మక శిక్షణ పొందుతున్నారు. వారి పర్యవేక్షణలో జరుగుతున్న ప్రయోగాలలో సేంద్రియ ఎరువులు మల్బరీ ఆకుల దిగుబడిని పెంచడమే కాకుండా, నేల తేమ నిలుపుదల, పోషకాల లభ్యతను మెరుగుపరుస్తున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా వర్షాధార వ్యవసాయ పరిస్థితుల్లో ఇవి గొప్ప ఫలితాలను చూపిస్తున్నాయని తెలిపారు. సిఫార్సు చేసిన సేంద్రియ ఎరువుల మోతాదులు కంపోస్ట్ ఎరువు: 10–15 టన్నులు / ఎకరం, వర్మికంపోస్ట్: 2–3 టన్నులు / ఎకరం / సంవత్సరం, పొలంయార్డ్ మందం లేదా అదనపు కంపోస్ట్: 5–10 టన్నులు / ఎకరం, పట్టు పురుగు బెడ్ రెఫ్యూజ్ వర్షాకాలం ప్రారంభంలో 1–2 టన్నులు / ఎకరం, సేంద్రియ సాగు వల్ల ప్రయోజనాలు నేల సారవంతం కావడంలో మెరుగుదల, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుదల, సూక్ష్మజీవుల చురుకుదల, మల్బరీ ఆకుల్లో ప్రోటీన్ శాతం వృద్ధి, నేల క్షీణత తగ్గింపు, రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గింపు ఉంటుందన్నారు. ఈ క్షేత్రం విద్యార్థులకు నేరుగా వ్యవసాయ అనుభవాన్ని అందిస్తూ, ఒక ఆదర్శ శిక్షణ మోడల్‌గా అభివృద్ధి చెందింది. "ఇది విద్యార్థులకు ప్రయోగాత్మక అవగాహన కలిగించే విలువైన వేదిక. భవిష్యత్తులో మరింత అభివృద్ధికి ఇది దోహదపడే ప్రాజెక్టు" అని డా. సుజాత, డా. కనిజ్ ఫాతిమా పేర్కొన్నారు. వారిచ్చిన వివరాల ప్రకారం, ఈ విభాగం ఆధ్వర్యంలో ప్రస్తుతం రెండున్నర ఎకరాల్లో మల్బరీ వనరులతో పాటు టస్సర్ సిల్క్ వార్మ్ కోసం అవసరమైన ఫుడ్ ప్లాంట్లు (తుస్సర్ పట్టు పురుగు ఆహార మొక్కలు) పెంచుతున్నారు. ఇందులో 7 నుంచి 8 రకాల మల్బరీ రకాలు ఉన్నాయి. 2010లో యూజీసీ మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ నిధులతో ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం జరిగింది. ప్రస్తుతానికి తెలంగాణ రాష్ట్రంలో సెరికల్చర్ రీసెర్చ్, రీరింగ్ యూనిట్స్, ఎం.ఎస్సీ సెరికల్చర్ కోర్సును నిర్వహిస్తున్న ఏకైక విశ్వవిద్యాలయం కాకతీయ విశ్వవిద్యాలయం అని వారు స్పష్టం చేశారు.

# ఎంవీ యాక్ట్ రద్దు చేయాలి

◆ జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సీఐటీయూ పిలుపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రవాణా రంగ కార్మికులకు నష్టం కలిగించే మోటార్ వాహనాల చట్టం (ఎంవీ యాక్ట్)ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఉపాధ్యక్షులు జి. ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ట్రాన్స్‌పోర్ట్ జిల్లా కన్వీనర్ ధారావత్ భాను నాయక్ అధ్యక్షతన హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో జరిగిన రవాణా రంగ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. రాగుల రమేష్, జి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 2019 మోటార్ వెహికల్ యాక్ట్ వాహనదారులకు నష్టం చేసే విధంగా ఉందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి బహుళ జాతి సంస్థలు ప్రవేశించడం వల్ల ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని, ఈ సంస్థల ప్రయోజనాల కోసమే కొత్త చట్టాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో రూ.1,000 కోట్లతో వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక విధానాలతో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి, సంఘటిత, అసంఘటిత కార్మికుల శ్రమను దోపిడీ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రవాణా రంగ కార్మికులంతా పాల్గొని బంద్ పాటించాలని రాగుల రమేష్, ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు మందుల శ్రీనివాస్, జి. సంపత్, రవీందర్, ఎండి. సుధన్, జి. కుమార్, రమణారెడ్డి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులందరూ వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని 42వ డివిజన్ కార్పొరేటర్, డివిజన్ ఇందిరమ్మ కమిటీ చైర్‌పర్సన్ గుండు చందన పూర్ణచందర్ కోరారు. మంగళవారం రంగసాయిపేటలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ఆమె ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ, లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం ముగ్గు వేసే ముందు తప్పనిసరిగా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎందుకంటే, ముగ్గు వేసిన రోజున అధికారులు ఆ ఖాళీ స్థలాన్ని పరిశీలించి, ఫొటో క్యాప్చర్ చేసి, జియో ట్యాగింగ్ చేస్తారని ఆమె తెలిపారు. ఇలా చేయడం వల్లనే నిర్మాణ దశలను బట్టి బిల్లులు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమ అవుతాయని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కేడల పద్మ జనార్దన్, ఎలుగు సాంబేశం, దామరకొండ కరుణాకర్, మజ్జిగ తిరుమల్, హౌసింగ్ ఏఈ జగదీష్, డివిజన్ అధికారి ఆరోగ్యం, నాయకులు బొలుగొడ్డు అనిల్, పాలకుర్తి సుమన్, సోమ అనిల్, కంచ మల్లయ్య, లబ్ధిదారులు కంచ గౌతమి, మద్ది రమ, కంచ కోమల, చిట్ల సృజన, కంచ కవిత, అవునూరి పూల తదితరులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తిలో రైతు భరోసా సంబరాలు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్ట జంక్షన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వర్ధన్నపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే నాగరాజుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతులు టపాసులు కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో పంటలకు పెట్టుబడి సహాయం అందించడం ద్వారా రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. 1 కోటి, 49 లక్షల, 39 వేల, 111 ఎకరాలకు రైతు భరోసా నిధులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. గతంలో ఎకరాకు రూ.10,000 ఇవ్వగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.12,000 చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించిందని ఆయన వివరించారు. అనంతరం భీమారం రైతు వేదిక వద్ద నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తంగేళ్లపల్లి తిరుపతి, హసన్‌పర్తి కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వట్టే శ్రీనివాస్ రెడ్డి, మదన్ గౌడ్, లక్ష్మారెడ్డి, మడిపల్లి మాజీ సర్పంచ్ విజయ్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

◆ విద్యార్థులకు అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, దామెర:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊరుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, మండల విద్యా శాఖ అధికారి, ఎస్సై అశోక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ, మత్తు పదార్థాల వాడకం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా మత్తు పదార్థాలను నిర్మూలిద్దామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మండల విద్యా శాఖ అధికారి లకావత్ రాజేష్ కుమార్ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి పాఠశాలలో "ప్రహరీ క్లబ్" పేరుతో ఇద్దరు విద్యార్థులతో కమిటీలు ఏర్పాటు చేశామని, ఈ కమిటీలు విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటాయని తెలిపారు. దామెర ఎస్సై కొంక అశోక్ మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉద్యోగాలు సంపాదించానని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులు సరైన క్రమశిక్షణతో చదివి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.25 వేల విలువైన స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్, పెన్సిల్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా త్వరలోనే వారి అవసరాలను తీరుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పుల్లూరి స్వప్న సదానందంకు సన్మానం



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందంను మంగళవారం ఆమె నివాసంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ, లక్ష డప్పుల వెయ్యి గొంతుకల రాష్ట్ర కోఆర్డినేటర్ రామంచ భరత్, ఎమ్మార్పీఎస్ జమ్మికుంట మాజీ మండల అధ్యక్షుడు బోయిని సమ్మయ్య మాదిగ, రొంటాల సంపత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాల చరిత్రలో ఉత్తర తెలంగాణలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తమ మాదిగ జాతి బిడ్డ అయిన పుల్లూరి స్వప్న సదానందంకు అవకాశం లభించడం షెడ్యూల్ కులాల ఎస్సీ వర్గీకరణ ఫలితమేనని, ఇది మాదిగ జాతికి అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. అలాగే, వ్యవసాయ మార్కెట్‌కు రైతుల సోదరులకు వారధిగా ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని పుల్లూరి స్వప్న సదానందంను నాయకులు కోరారు.

# ఘనంగా రైతు భరోసా సంబరాలు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్ లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు చెన్నోజు సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం" రైతు భరోసా " సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అంతకంటే ముందు తాళ్లపాడు సెంటర్లో బాంబులు కాల్చి రైతులకు, ప్రజలకు, రహదారి వెంట వెళ్లే వారికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ములుగు అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వెంకటాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు వేముల చంద్రకర్ రెడ్డి, మిల్కూరి ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ములుగు ఉపాధ్యక్షులు దొంతర వీన కుమార్, ఎన్ఎస్ యూఐ ములుగు జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మూడు వీరేశం, చిన్నోజు శీను, బోయిని సుధాకర్, కొంపల్లి దేవేందర్ రెడ్డి, పులి నరసయ్య, సోమిడి దేవేందర్, జంగిలి రవి, గొల్లన వెంకటేష్, కొంపెల్లి రాజిరెడ్డి, కాయితపు రవి, పురుషోత్తం, అన్నవేన రాజు, అంభీర్ సంపత్, లోటపేటల రాములు, బండ్ల రాజయ్య, అల్లం ఓదెలు, కాసిడి శ్రీనివాస్ రెడ్డి, మాడ ప్రకాష్, బోడ రాములు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ నగరంలోని 39వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన బత్తుల భావన మహేష్, గాండ్ల భిక్షపతి నిర్మించుకోనున్న నూతన గృహాలకు మంగళవారం శంకుస్థాపన జరిగింది. కొండా సురేఖ మురళీధర్ రావు ఆదేశాల మేరకు అధికారులు, 39వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ ముగ్గులు పోసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేర్ల కిషోర్, మాజీ కార్పొరేటర్లు బాసని శ్రీనివాస్, మేడిది రజిత మధు, సిద్ధం రాము, వల్లకట్ల ధనలక్ష్మి, గుడికందుల క్రాంతి, శ్రీరాముల రజిత, మహిళా డివిజన్ అధ్యక్షురాలు కన్యబోయిన సునీత, నాగపురి నాగరాజు, దద్దనాల రమేష్, గాదె నర్సింగం, తంగెళ్ల దేవేందర్, కంచి మనోహర్, భాస్కారుల రజని, చిలువేరు బాబు, బొడ్డు పవన్, బత్తుల భిక్షపతి, బొచ్చు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి

◆ నెల రోజుల్లో అన్ని కాలువలు పూర్తి కావాలి
◆ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, జనగామ :** దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను త్వరగా పూర్తి చేసి, నెల రోజుల్లో అన్ని కాలువలు సిద్ధం చేయాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. మంగళవారం జనగామ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌లతో కలిసి సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పనులను వేగవంతం చేసి, ఈ సీజన్‌లోనే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అశ్వరావుపేట కుడి ప్రధాన కాలువ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలి, మొత్తం 20 డిస్ట్రిబ్యూటరీలతో పాటు సబ్ మైనర్లలో కూడా సిల్ట్ తొలగింపు (సిల్ట్ రిమూవల్), జంగల్ క్లియరింగ్ పనులు చేపట్టాలి, అశ్వరావుపల్లి కుడి కాలువ చాలా ప్రధానమైనదని, ఆశించిన స్థాయిలో పనులు జరగాలని ఆయన నొక్కి చెప్పారు. కేవలం 20L కిందనే 14 వేల ఎకరాల ఆయకట్టు ఉందని, నెల రోజుల్లో 1L నుంచి 20L వరకు అన్ని పనులను పూర్తి చేయాలి, ఘనపూర్ నుండి నవాబ్‌పేట ప్రధాన కాలువలో ఉన్న 10 డిస్ట్రిబ్యూటరీలలో (1L ఉప్పుగల్, తిమ్మంపేట, 2L సముద్రాల,



నారాయణపురం, సూరారం వరకు) సిల్ట్ రిమూవల్ చేయాలి, 4Lలో కూడా సిల్ట్ రిమూవల్ చేసి, షట్టర్లు ఏర్పాటు చేయాలి, నవాబ్‌పేట అప్రోచ్ ఛానెల్‌ను శుభ్రం చేయాలి, ప్యాకేజీ 1, 2, 3లను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని, పంపు హౌస్ నిర్మాణాలను పూర్తి చేయాలి చెప్పారు. మల్లన్న గండి కుడి ప్రధాన కాలువ ద్వారా ఈ సీజన్‌లో నీరు అందించాలని, దేవాదుల ఫేజ్ 1, 2, 3లలో పూర్తి స్థాయిలో పంపింగ్ చేయాలన్నారు. సమ్మక్క సారలమ్మ బ్యారేజ్‌లో లిఫ్ట్ చేయడానికి సరిపోను నీటి లభ్యత ఉందని, పంపు హౌస్‌ల మెయింటెనెన్స్‌ను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని ఆదేశించారు. నీటి డిమాండ్‌కు ముందే పంపింగ్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలి. ముందుగానే రిజర్వాయర్లను నింపి పెట్టుకోవాలి, ధర్మసాగర్ నుంచి నీటి డిస్ట్రిబ్యూషన్‌పై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.ధర్మసాగర్, ఘనపూర్, నవాబ్‌పేట, అశ్వరావుపల్లి రిజర్వాయర్లను 20 రోజుల్లో నింపాలని, ధర్మసాగర్ నార్త్, సౌత్ కెనాల్స్ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు చేరాలని ఆదేశించారు. అనంతరం "మన జిల్లా – మన నీరు" వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, కలెక్టర్ కార్యాలయం ఆవరణలో "మన జిల్లా – మన నీరు" కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంత ఏర్పాటు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. ఇరిగేషన్ సీఈ అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, ఘనపూర్ ఏఎంసీ చైర్మన్ లావణ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డికి సన్మానం



**వరంగల్ వాయిస్, కాజీపేట:** ఇటీవల హనుమకొండ జిల్లా కాజీపేట ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన పింగళి ప్రశాంత్ రెడ్డిని జమ్మికుంట ప్రాంతానికి చెందిన ప్రముఖులు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రశాంత్ రెడ్డి జమ్మికుంట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో ప్రజలకు చేదోడు వాదోడుగా నిలిచి, వారి మన్ననలు పొంది గొప్ప మానవతావాదిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అదే సమయంలో జాతీయ భావాన్ని పెంపొందించడం కోసం "నిత్య జన గణ" అనే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, జమ్మికుంట ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా నిలబెట్టారని గుర్తుచేశారు. కాజీపేట ఏసీపీగా కూడా ఆయన ఈ ప్రాంత ప్రజలకు విశేష సేవలు అందిస్తూ గొప్ప ఖ్యాతిని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ నర్సిని కేదారి, ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్, అంబాల ప్రభాకర్ (ప్రభు), జగన్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని స్కూళ్లను సీజ్ చేయాలి



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్‌కు అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర కమిటీ తమ కార్యాలయంలో మెమోరాండం సమర్పించింది. నర్సంపేట పట్టణంలో అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో కేవలం 25 ప్రైవేట్ పాఠశాలలకు మాత్రమే అనుమతులు ఉండగా, గీతాంజలి స్కూల్, డఫోడిల్స్ హై స్కూల్, విజ్డమ్ హై స్కూల్, మదర్స్ ల్యాండ్ హై స్కూల్, కేవీఆర్ శ్రీఅభ్యాస్ హై స్కూల్, ఎస్.వీఎస్ హై స్కూల్ వంటి 9 పాఠశాలలు అనధికారికంగా నడుస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా, స్థానిక మండల విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా నాయకులు పోలబోయిన రాజు, జావాజి శ్రీజిత్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రమిత వ్యాధులపై వైద్య శిబిరం

**వరంగల్ వాయిస్, వరంగల్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు ఆదేశాల మేరకు, ఖానాపూర్ మండలంలోని ధర్మారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సునీత ఎంఎల్ హెచ్ పీ పర్యవేక్షణలో మంగళవారం ఒక వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డెమో అనిల్ కుమార్ పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. సీజన్ మారినందు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు, నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, రక్త విరేచనాలు, జ్వరం వంటి సంక్రమిత వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. కాబట్టి, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కలుషితం కాని ఆహారం, నీరు తీసుకోవాలని సూచించారు. దోమలు పుట్టకుండా, పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని వ్యాధులకు గురికాకుండా ఉండాలని కోరారు. గ్రామంలో డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న ఒక వ్యక్తి ఇంటికి వెళ్లి, డాక్టర్ సహాయంతో తగిన చికిత్సలు అందించారు. అనంతరం గ్రామ పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది సహాయంతో గ్రామంలో ఇండోర్ స్ప్రే, అవుట్‌డోర్ స్ప్రే పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సీహెచ్ఓ రాజయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ నంద, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, గ్రామపంచాయతీ సెక్రెటరీ అనిత, ఆరోగ్య పర్యవేక్షకులు దామోదర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, కనక లక్ష్మి, సుజాత, ఆశ కార్యకర్తలు సుజాత, చిట్టి, పద్మ, పవిత్ర, గ్రామపంచాయతీ సిబ్బంది చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

● పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్రంలోని రైతులందరికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి 6000 చొప్పున నిధులు జమ చేసి రైతుల కళ్లల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆనందం నింపిందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రోజున రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశానుసారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా పథకం కింద రాష్ట్రంలో కోటి 49 లక్షల ఎకరాలకు తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో 18 వేల కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేసిందని, నేడు ప్రజా ప్రభుత్వం 18 నెలలలోనే 21 వేల కోట్ల రూపాయలను రైతు సంక్షేమం కోసం ఖర్చు చేసిందని తెలిపారు. నాటి వైఎస్సార్ నుంచి నేటి రేవంత్ రెడ్డి వరకు ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేత సోదా రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ దాసరి భిక్షపతి, మాజీ కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్, మాజీ ఎంపీపీ స్వర్ణలత, చందుపట్ల రాఘవరెడ్డి, దార్న వేణుగోపాల్, నల్లెల అనిల్, పసుల రమేష్, బండి సదానందం, మంద నాగరాజు, దుబాసి వెంకటస్వామి, బొచ్చు శ్రీధర్, పోరండ్ల వేణు, లక్కం వసంత, నలుబోల కృష్ణయ్య, రవి, మచ్చ సుమన్,గడ్డం శివ,బొచ్చు జెమిని, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తింపునకు పారిశుద్ధ్యం అత్యవసరం

◆ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** స్వచ్ఛ సర్వేక్షణ్ (SSG) 2025లో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తింపు పొందేందుకు గ్రామాలలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ప్రజలు 100 శాతం మరుగుదొడ్లను వినియోగించుకునేలా గ్రామ పంచాయతీ సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంపత్ రావుతో కలిసి స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించిన అనంతరం, గ్రామ పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ జీ- 2025లో వెయ్యి మార్కులకు 540 మార్కులు సాధించడానికి ఎంపీడీఓలు, ఎంఈఓలు, గ్రామ కార్యదర్శులు ప్రతి గ్రామంలో 100 శాతం మరుగుదొడ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజలు సంచరించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, గ్రామంలోని ప్రతిచోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి, ప్రజలను చైతన్యం చేయడానికి గోడలపై వాల్ పెయింటింగ్స్ వేయించాలన్నారు. ఎస్ఎస్ జీ-2025 సర్వే ఆధారంగా జిల్లాలకు ర్యాంకింగ్ ఇవ్వబడుతుందని, కాబట్టి ప్రతి గ్రామం పరిశుభ్రతను పాటిస్తూ అవార్డు పొందేలా చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ దేవరాజు, డిప్యూటీ సీఈఓ రాజు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# హిందీలో మజ్దూర్..

తలైవా రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా ఇది. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. అగ్ర నటులు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహిర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆగష్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించి తాజాగా హిందీలో టైటిల్‌ను మార్చారు మేకర్స్. హిందీలో ఈ సినిమాను 'మజ్దూర్' అనే పేరుతో తీసుకురాబోతున్నట్లు సమాచారం. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు అని అర్థం. అయితే కూలీ అనే టైటిల్ బాగానే ఉన్నప్పటికి పేరు మార్చడంపై చాలా మంది నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గతంలో వచ్చిన అమితాబ్ బచ్చన్ కూలీ (1983), గోవిందా కూలీ నెం. 1 (1995), వరుణ్ ధావన్ కూలీ నెం. 1 (2020) వంటి చిత్రాల కాపీరైట్ సమస్యల వల్లే ఈ పేరు మార్పు జరిగిందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి.




# అది నచ్చినందుకే ప్రశంసలు..

**ప్రశంసలతో పోస్ట్ చేసిన రష్మిక**

కోలీవుడ్ స్టార్ ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రలో, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందించిన తాజా చిత్రం 'కుబేర' సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న కుబేర.. మంచి వసూళ్లతో సత్తా చాటుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అదిరిపోయే కలెక్షన్లు రాబడుతోంది. ఈ మూవీ ద్వారా నాగ్ లో కొత్తకోణం కనిపించింది. ఇక ధనుష్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు అయితే ఫిదా అయ్యారు. ఇందులో సమీరా పాత్రలో నటించిన రష్మిక కూడా ప్రేక్షకులను మెప్పించింది. అయితే తాజాగా తన కోస్టార్ ధనుష్ గురించి ఒక ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకుంది రష్మిక. 'మీతో అంత పెద్ద సినిమా చేసినప్పటికీ మనిద్దరిది ఒక్క సెల్ఫీ మాత్రమే ఉంది. మీరు అద్భుతమైన వ్యక్తి, మనం మట్లాడుకున్న ప్రతిసారీ వేర్వేరు నగరాల్లో ఉన్నాం. ఇద్దరం వేర్వేరు పనులు చేసుకుంటూ మాట్లాడుకునేవాళ్లం. విశ్రాంతి ఎంత ముఖ్యమో చర్చించేవాళ్లం. కానీ, విశ్రాంతి మాత్రం తీసుకోలేదు. కుబేర నటనపరంగానే కాదు.. నిజ జీవితంలోనూ మీరు చేసే పనులు ఎంతోమందికి ఆదర్శం. చుట్టూ ఉన్న వారితో ఎంతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటారు. ముఖ్యంగా మీరు సెట్‌ల్లో నాకోసం తెచ్చిన లడ్డులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నాకు తమిళ డైలాగుల్లో మీరు చేసిన సహాయం.. నేను ఏదైనా డైలాగ్ చెప్పినప్పుడు మీరు ప్రశంసించిన తీరు. ఇవన్నీ చిన్న చిన్న విషయాలు కావచ్చు. కానీ, జీవితమంతా గుర్తుంటాయి' అంటూ ధనుష్ దిగిన సెల్ఫీ ని షేర్ చేశారు రష్మిక. తాజాగా రష్మిక మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





# విజయ్‌తో లవ్‌లో త్రిష అంటూ.. పుకార్లు

ఓ స్టార్ హీరోతో హీరోయిన్ త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ కోలీవుడ్‌లో వార్తలొచ్చాయి. సదరు హీరోతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో త్రిష పంచుకుంటూ బర్త్‌డే విషెస్ తెలియజేయడం, అదే ఫొటోను ఆమె తల్లి షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీ జోడిరచడం అందుకు కారణం. ఆ రూమర్స్‌పై త్రిష పరోక్షంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రేమపై పోస్టు పెట్టారు. పూర్తిగా ప్రేమలో మునిగిపోతే, అది కొందరిని తికమక చేస్తుందని పేర్కొన్నారు. తాజాగా కోలీవుడ్ హీరోయిన్ త్రిష చేసిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో రచ్చకు కారణమైంది. జూన్ 22న విజయ్ బర్త్ డే సందర్భంగా హ్యాపీ బర్త్ డే బెస్టెస్ట్ అని హగ్ సింబల్ జత చేసి విజయ్ తో పక్క పక్కనే కూర్చున్న పిక్ షేర్ చేసింది త్రిష. అంతేనా ఈ ఫోటోకు త్రిష తల్లి సైతం లవ్ సింబల్స్ జోడిరచి ఇన్ స్టా స్టోరీ పెట్టింది. దాంతో త్రిష, విజయ్ మధ్య లవ్ అఫైర్ ఉందని నెటిజన్స్ వీరిని లవర్స్ గా కన్ఫామ్ చేసారు. ఈ ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారని చాలా కాలం వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఈ ఇద్దరు ఎప్పుడు వాటిని ఖండిరచలేదు. విజయ్ అండ్ త్రిష లవ్ బర్డ్స్ అంటూ ఇప్పటి నుండే కాదు.. ఎప్పటి నుండో గాసిప్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇద్దరూ కలిసి జర్నీ చేయడం, కీర్తి సురేష్ పెళ్లికి గోవా వెళ్లడం కూడా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని కన్ఫర్మ్ చేస్తున్నారు నెటిజన్లు. రీసెంట్లీ గుడ్ పీపుల్, గుడ్ టైమ్స్ అంటూ ఓ పోస్ట్ పెట్టింది త్రిష. బర్త్ డే రోజు విజయ్ కుక్క పిల్లని ఎత్తుకున్న ఫోటో షేర్ చేసింది. కుక్క పిల్లను ఈ ఏడాదే ఫిబ్రవరిలో త్రిష దత్తత తీసుకుంది. అంటే ఆ ఫోటో రీసెంట్ గా తీసుకుంది. ఇద్దరు కలిసి త్రిష ఇంట్లో పార్టీ చేసుకున్నారన్న టాక్ నడుస్తోంది. త్రిష, విజయ్ 2004లో గిల్లీ సినిమాలో తొలిసారి జతకట్టారు. 2006లో ఆదితో పాటు రీసెంట్లీ లియోలోను కలిసి నటించారు. తన 25 సంవత్సరాల కెరీర్లో ఇప్పటి వరకు స్పెషల్ సాంగ్ చేయని త్రిష గోట్‌లో విజయ్ కోసం నర్తించింది. దీంతో ఈ ఇద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ అనే చర్చకు బలం చేకూరింది.

# అనుపమ మూవీకి సెన్సార్ కష్టాలు

మలయాళ నటులు అనుపమ పరమేశ్వరన్, కేంద్రమంత్రి సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను కాస్మోస్ ఎంటర్‌టైనమెంట్స్ నిర్మిస్తుండగా.. శృతి రామచంద్రన్, మాధవ్ సురేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూన్ 27 ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ అభ్యంతరం వలన సినిమా వాయిదా పడినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో బాధితురాలి పాత్రకు జానకి అని దైవ సంబంధమైన పేరుని పెట్టడంపై ముంబై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో జానకి అనే పేరుతో ఓ మహిళ అత్యాచార బాధితురాలిగా న్యాయపోరాటం చేస్తుందని, అయితే 'జానకి' అనేది సీతాదేవికి మరో పేరు కావడంతో, అలాంటి పేరును అత్యాచార బాధితురాలికి పెట్టకూడదని సెన్సార్ బోర్డు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందిస్తూ, జూన్ 27న విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడిరదని ధృవీకరించారు. ఈ నిర్ణయంపై మలయాళ సినీ పరిశ్రమలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ జనరల్ సెక్రటరీ బి. ఉన్నికృష్ణన్ సెన్సార్ బోర్డు నిర్ణయాన్ని విమర్శించారు. దేవుళ్ల పేర్లు కలిగిన పాత్రలకు ఇటువంటి నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందని, ఇది కళాత్మక స్వేచ్ఛను అడ్డుకుంటుందని ఆయన అన్నారు. ఇలాంటి నిబంధనలు ఉంటే, హిందూ మతానికి చెందిన పాత్రలకు పేర్లు ఎంపిక చేసుకోవడం చాలా కష్టమవుతుందని ఆయన ప్రశ్నించారు. తిరువనంతపురంలోని ప్రాంతీయ సెన్సార్ కార్యాలయం ఈ చిత్రానికి జ/ం సర్టిఫికేట్ జారీ చేసినప్పటికీ, ముంబైలోని ప్రధాన కార్యాలయం ఈ టైటిల్‌ను మార్చాలని డిమాండ్ చేయడంతో ఈ సమస్య తలెత్తింది. పేరు మార్చాల్సి వస్తే, సినిమాలోని అనేక సంభాషణలను కూడా మార్చాల్సి వస్తుందని మేకర్స్ ఆందోళన చెందుతున్నారు.





# కష్టపడిన వారికే పదవులు

- త్వరలో మార్కెట్, దేవాలయ కమిటీల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పార్టీని సిద్ధం చేయాలి
- రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** భవిష్యత్తులో అనేక సవాళ్లు ఎదురుకానున్నందున వాటిని అధిగమించేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. డీలిమిటేషన్ ప్రక్రియ, మహిళా రిజర్వేషన్ల అమలు, జమిలి ఎన్నికల నిర్వహణ వంటి కీలక పరిణామాలు భవిష్యత్తులో చోటుచేసుకోనున్నాయని ఆయన పార్టీ నేతలకు వివరించారు. హైదరాబాద్ లో మంగళవారం నిర్వహించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. త్వరలోనే మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అదేవిధంగా, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికకు పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సమాయత్తం చేయాలని ఆయన సూచించారు.

### పార్టీ కోసం శ్రమించిన వారికే..

పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికే సముచిత స్థానం లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ ఉద్ఘాటించారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. ఇందుకోసం బూత్ స్థాయి నుంచి గ్రామ, మండల స్థాయి వరకు పార్టీ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ కమిటీల్లోని నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాల్సిందేనంటూ ఆదేశించారు. పనితీరు కనబరిస్తేనే పదవులు దక్కుతాయన్న విషయం మరువరాదన్నారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు అండగా నిలిచి, కష్టపడి పనిచేసిన వారికి ఇప్పటికే పదవులు ఇచ్చామన్నారు. భవిష్యత్తులో కూడా వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని పార్టీ నాయకులు ముందుకు సాగాలని ఆయన హితవు పలికారు. అవసరమైతే తాను కూడా గ్రామాల్లో పర్యటించేందుకు సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్టీ, ప్రభుత్వం మధ్య పూర్తి సమన్వయంతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఆయన పునరుద్ఘాటించారు.



# తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలి

- అప్పుడే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుంది
- బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి
- కుమారస్వామికి ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ మండలం, చాగల్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుమారస్వామి తాను పనిచేస్తున్న పాంనూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోనే తన ముగ్గురు పిల్లలను చదివించడం అభినందనీయమని బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎండి యూనస్, జనసేన పార్టీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు మునిగాల పవన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ఆవరణలో కుమారస్వామిని శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పిల్లలను కార్పొరేట్ బడుల్లో చదివించే ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కుమారస్వామిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కుమారస్వామి 24 ఏండ్లుగా ఉపాధ్యాయ వృత్తిని, ప్రభుత్వ పాఠశాలలను నమ్మి ఉద్యోగం చేస్తున్నారు. తన ముగ్గురు పిల్లలను అంగన్వాడీ, ఎంపీయూపీఎస్ పాఠశాలలో చదివించడం సంతోషకరమన్నారు.

# 9 రోజులు రూ.9,000కోట్లు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమంలో భాగంగా ప్రవేశ పెట్టిన 'రైతు భరోసా' పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.9,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ లో నిర్వహిస్తున్న 'రైతు భరోసా' సంబరాల్లో భాగంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రైతులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమానికి వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, మండల ప్రత్యేక అధికారి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్ల ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, క్రైం :** డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని డ్రగ్స్ వ్యతిరేకంగా, ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తుపదార్థాలను సమాజం నుంచి తరిమి కొట్టేందుకు ప్రతి పౌరుడు భాగస్వాములు కావడంతో పాటు పోలీసులుకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ వారోత్సవారలను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని వర్గాల ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించడంతో పాటు, వాటి వినియోగం ద్వారా నష్టాలపై ప్రజలకు పోలీసుల వివరించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ర్యాలీలు, డ్రాయింగ్, వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు అవగాహన పెరుగుతోందన్నారు. ఎవరైన మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా తక్షణమే 8712584473 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు. సమచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడుతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో అదనపు డీసీపీ రవి, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్‌రాజు, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ దత్తు రెడ్డి హఠాన్మరణం

- సంతాపం ప్రకటించిన నేతలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈనాడు వరంగల్ స్టాఫ్ రిపోర్టర్ జీడిపల్లి దత్తురెడ్డి (37) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉండగా తీవ్ర గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం తరలించారు. దత్తురెడ్డిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం మద్దెల చెరువు గ్రామినికి చెందిన దత్తు రెడ్డి 2015లో ఈనాడులో చేరారు. హైదరాబాద్, నల్గొండలో పనిచేసిన ఆయన గత సంవత్సరం సెప్టెంబర్ లో వరంగల్ కు బదిలీ మీద వచ్చారు. ఆయన హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురి చేసింది. ఉజ్వల భవిష్యత్తు ఉన్న దత్తు రెడ్డి మరణం చాలా బాధకరం అని, వారి కుటుంబ సభ్యులకు పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### టీజేయూ 143 ఆధ్వర్యంలో..

దత్తు రెడ్డి అకాల మరణంతో టీయూడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా కమిటీ ఆధ్వర్యంలో




మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో సంతాపం తెలియజేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే హెచ్143 హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు గోకారపు శ్యాం కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు సంపేట సుధాకర్, కార్యదర్శి గొట్టే వెంకన్న, యూనియన్ నాయకులు మెండు రవీందర్, బొమ్మగాని ఆదర్శ్ గౌడ్, సాల్మన్, రంజిత్, పాత్రికేయులు ప్రసాద్, రజాక్, చిన్న అమర్, కిషోర్, కుడుతల రమేష్, దాసరి శ్రీనివాసులు, గోపగాని రమేష్, సంపేట వెంకటేశ్వర్లు, గోరింటల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. దత్తు రెడ్డి హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీరాం రాంచందర్, ప్రధానకార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు సంగోజు రవి, మిద్దెల రంగనాథ్ ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి టి.హరీశ్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com